ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు
5★ మంగళవారం 17 సెప్టెంబరు 2024

గంగమ్మ ఒడికి గణనాథుడు


గోదావరిఖని చౌరస్తాలో భక్తుల సందడి

అకాడ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, యువతి

- జై గణేష్ నినాదాలతో మారుమోగిన జిల్లా
- శోభాయాత్రలో వేలాదిగా జనం
- స్వాగతం పలికిన ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్
- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అకాడ విన్యాసాలు
- సాంప్రదాయ కోలాటాలు... నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- పెద్దపల్లిలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు


గోదావరిఖనిలో ఎంపీ, ఎమ్మెల్యే ముచ్చట్లు


పెద్దపల్లి ఎల్లమ్మ చెరువులో గణనాథుడి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్

జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై... గణపతి బప్ప మోరియా... అంటూ నినాదాలతో జిల్లా హోరెత్తింది. నవరాత్రులు పూజలందుకున్న గణనాథులకు సోమవారం శోభాయాత్రతో వీడ్కోలు పలికారు. అర్ధరాత్రి వరకు గోదావరి తీరాల్లో, చెరువుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జన ఊరేగింపులతో వాడవాడలా పండుగ వాతావరణం నెలకొన్నది. యువతులు, మహిళలు పెద్దసంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. నృత్యాలు, కోలాటాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అకాడ ప్రదర్శన చేశారు. పలువురు యువతీయువకులు కత్తిసాము, కర్రసాములు ప్రదర్శించారు.


నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


కారుపై నిమజ్జనానికి తీసుకెళుతున్న భక్తులు


ద్విచక్రవాహనంపై..

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 16: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు వినాయక విగ్రహాల నిమజ్జనంతో కోలాహలంగా మారింది. జెండా కూడలి మీదుగా వినాయక విగ్రహాలు ఊరేగింపు నిర్వహించారు. మొదట ఎమ్మెల్యే విజయరమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి ఎల్లమ్మ చెరువు ట్యాంకుబండ్‌పై పూజలు నిర్వహించి భారీ క్రేన్లతో విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యేను మున్సిపల్ చైర్మన్‌ను సన్మానం చేశారు. దాదాపు 200 పైచిలుకు వినాయక విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది ,మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లను నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో కళాశాలలో ఏర్పాటుచేసిన మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ: నవరాత్రులు పూజలందుకున్న గణనాథులకు సోమవారం శోభయాత్రలతో వీడ్కోలు పలికారు. గోదావరినదిలో ఘనంగా నిమజ్జనం చేశారు. గోదావరిఖని పట్టణంలో శోభయాత్రలో 600లకు పైగా గణనాథులు పాల్గొన్నాయి. గణేష్ చౌక్ వద్ద గణేష్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వేలాదిగా జనం శోభాయాత్రకు తరలివచ్చారు. ఉత్సవాల్లో యువతులు, మహిళలు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. నృత్యాలు, కోలాటాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మనాలి దంపతులు వివిధ ప్రాంతాల గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనగర్‌లోని మరాఠీ సంఘ్ ఆధ్వర్యంలో గణనాథుల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిఖని గణేష్ చౌక్‌లో గణనాథులకు ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అకాడ ప్రదర్శన చేశారు. పలువురు యువతీయువకులు కత్తిసాము, కర్రసాములు ప్రదర్శించారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ గణనాథులకు స్వాగతం పలికారు. గోదావరిఖని లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మార్వాడీ సంఘ్ ఆధ్వర్యంలో శోభాయాత్రకు మహారాష్ట్ర నుంచి తెప్పించిన బ్యాండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గోదావరిఖనిలోని వాసవ్య విద్యాలయం పాఠశాల విద్యార్థులు పర్యావరణహిత గణపతిని ప్రతిష్ఠించి శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్ర సందర్భంగా సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా విద్యార్థులు శివపార్వతుల వేషధారణలతో సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చారు.

గోదావరిఖని వంతెన నుంచి రామగుండంతో పాటు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, జైపూర్ ప్రాంతాల గణనాథులను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గోదావరి వంతెనపై 20 ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేశారు. సింగరేణి సంస్థ ఎనిమిది క్రేన్‌లు ఏర్పాటు చేసింది. మంచిర్యాల నుంచి వచ్చే గణనాథులు గంగానగర్ సర్వీస్ రోడ్డు నుంచి ఫ్లై ఓవర్ కింద యూ టర్న్ తీసుకుని గోదావరి వంతెనపైకి వచ్చాయి. రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, టుటౌన్ సీఐ ప్రసాద్ రావు, గోదావరిఖని వంతెనపై రక్షణ ఏర్పాట్లు చేశారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని కాపులపల్లిలో గణనాథుని శోభా యాత్రలో మహిళలు కోలాటాల ప్రదర్శన నిర్వహించారు. అప్పన్నపేట, నిట్టూరు, పెద్దబొంకూరు, రాగవపూర్, కనగర్తి తదితర గ్రామాల్లో గణనాథుని నిమజ్జనం చేశారు.

ఓదెల: మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథున్ని నాంసానిపల్లి బీటీ చెరువులో అలాగే పొత్కపల్లి, కనగర్తి, ఓదెల, కొలనూర్‌లోని విగ్రహాలను సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. పొత్కపల్లిలో నిర్వహించిన సమావేశంలో సీఐ సుబ్బారెడ్డి హజరై గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందికి సూచనలు చేశారు.

మంథని: మంథని డివిజన్‌లో వినాయక విగ్రహాలను ఆనందోత్సాహాల మధ్య భక్తులు గోదావరి తీరాల్లో, చెరువుల్లో నిమజ్జనం చేశారు. పట్టణంలో పెద్దఎత్తున ఊరేగింపులు నిర్వహించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, సీఐ రాజు, ఎస్‌ఐ రమేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. విగ్రహాలను గోదాదరిలో సింగరేణికి చెందిన క్రెయిన్ సహాయంతో రెస్క్యూ టీం వారు నిమజ్జనం చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గణనాథులను మానేరు, హుస్సేన్‌మియ వాగులలో నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎంపీపీలు గోపగోని సారయ్యగౌడ్, నూనేటి సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆడెపు శ్రీదేవిరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి పూజలు చేసి నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామగిరి/కమాన్‌పూర్/జూలపల్లి: రామగిరి, కమాన్‌పూర్, జూలపల్లి మండలాల్లో వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. గుండారంలోని రిజర్వాయర్‌లో గణనాథులను నిమజ్జనం చేశారు. మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, ఎంపీడీవో లలిత, కార్యదర్శి బచ్చల ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. క్రేన్ ఏర్పాటు చేయించిన ఆర్‌జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఓసీపీవో రాధాకృష్ణ, ఎస్‌ఎస్‌వోకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ముత్తారం: మండలంలోని ఇప్పలపల్లి, సీతంపేట, ఖమ్మంపల్లి, జిల్లాల పల్లి, గ్రామాల ప్రజలు ఖమ్మంపల్లి మానేరు వద్దకు వాహనాల్లో గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి మానేరులో నిమజ్జనం చేపట్టారు. పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణనాథులను ఓడేడు మానేరు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఎస్సై గోపతి నరేష్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 188 వినాయక విగ్రహాలను నెలకొల్పారు. గ్రామాల్లో వాడవాడన వెలసిన మండపాలను రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, కేశోరాం సిమెంటు కంపెనీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక్ హరి, 22వ డివిజన్ కార్పోరేటర్ కౌశిక్ లత, ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి నూర సమ్మయ్య, సందర్శించి పూజలు నిర్వహించారు. ఎస్‌ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ చౌరస్తాలో గణేష్ ఉత్సవసమితి ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్దకు కాలనీ పరిధిలోని 90 వినాయక మండ పాల నిర్వాహకులు తమ విగ్రహాలను తీసుకురాగా ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేశారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జీఎం సూర్యనారాయణ ఉత్సవ కమిటీ వేదిక వద్ద గణనాథులకు స్వాగతం పలికారు. గణేష్ ఉత్సవసమితి నాయకులు జగన్నాథాచార్యులు, దావ రాజిరెడ్డి, మూకిరి రాజు, ముత్యాల బాలయ్య, మహేందర్‌రెడ్డి, నర్సయ్య, ఆకుల శశి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మారం: ధర్మారంలోని బ్రిలియంట్ విద్యా సంస్థల ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, గణేషనగర్‌లో భారీ వినాయకుని విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. ధర్మారంలోని ప్రధాన చౌరస్తాలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ప్రత్యేక స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎలిగేడు: మండలంలోని గణేష్ నిమజ్జనం కన్నుల పండువగా జరిగింది. తహసీల్దార్ బషీరోద్దీన్ పర్యవేక్షించి తగిన ఏర్పాట్లు చేశారు. జూలపల్లి ఎస్సై శ్రీధర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


గోదావరిఖనిలో గణనాథుడి ఊరేగింపు


పెద్దపల్లిలో వినాయకులను నిమజ్జనానికి తరలిస్తున్న చిన్నారులు


మంథనిలో..

నిఘా నీడలో గణేష్ నిమజ్జనం

- పర్యవేక్షించిన సీపీ శ్రీనివాస్
- గోదావరి వంతెన వద్ద ప్రత్యేక ఔట్ పోస్టు ఏర్పాటు


ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్న సీపీ

కోల్‌సిటీ: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం జరిగిన గణేష్ నిమజ్జనం సీసీ కెమెరాల నిఘా నీడలో జరిగింది. రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ ఎం శ్రీనివాస్ రక్షణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీసీపీ చేతనతో కలిసి గోదావరి వంతెన పైనుంచి నిమజ్జనాన్ని పరిశీలించారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. గోదావరి వంతెన వద్ద సోమవారం ఔట్ పోస్టును ప్రారంభించారు. వంతెనపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఔట్ పోస్టులో కంట్రోల్ రూమ్ పెట్టారు. ఎక్కడెక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుందనే విషయాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించారు. మంచిర్యాల నుంచి వచ్చే వాహనాలను క్రమబద్ధీకరిస్తూ నిమజ్జనం సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీ సురేందర్, సీసీఎస్ ఏసీపీ వెంకటేష్, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ రక్షణ చర్యలను చేపట్టారు.

ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు

- మున్సిపల్, సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- పర్యవేక్షించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం జరిగిన గణేష్ నిమజ్జనానికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. రామగుండం నగరపాలక సంస్థ, సింగరేణి సంస్థ ఈ ఏర్పాట్లు చేసింది. శోభయాత్ర జరిగే ప్రాంతాల్లో పూర్తి స్థాయి లైటింగ్ ఏర్పాటుచేశారు. మెయిన్ చౌరస్తాలో ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేయగా పూర్తిగా వెలుగుపడే విధంగా లైట్లు ఏర్పాట్లు చేశారు. ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ అంతరాయం కలుగకుండా ఎక్స్‌ప్రెస్ లైన్ ఇచ్చారు. జనరేటర్లు ఏర్పాటు చేశారు. గోదావరి వంతెన వద్ద 20ప్లాట్‌ఫాంలు పెట్టారు. సింగరేణి సంస్థ ఎనిమిది క్రేన్‌లను సమకూర్చింది. కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు గణనాథులతో వచ్చిన పూలదండలు, ఇతర సామగ్రిలను కార్పొరేషన్ వాహనాల్లో తరలించారు. గోదావరి వంతెన పైనుంచి రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన 600 గణపతులతో పాటు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, జైపూర్‌కు చెందిన మరో 600 గణపతులను నిమజ్జనం చేశారు. గోదావరి వంతెన పైనుంచే నిమజ్జనం చేస్తుండడంతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో ప్రాజెక్టు గేట్లు మూసివేసే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి ఆరు వేల క్యూసెక్కులు వదిలేలా ఒత్తిడి తెచ్చారు.


రామగుండంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


ధర్మారంలో..


కాల్వశ్రీరాంపూర్‌లో..


కాపులపల్లిలో కోలాటం ఆడుతున్న మహిళలు


నాంసానిపల్లిలో నిమజ్జనం చేస్తున్న మల్లన్న ఆలయ సిబ్బంది

మత్స్యకారుడికి చిక్కిన భారీ చేప



28కిలోల చేపతో మత్స్యకారుడు తిరుపతి

తిమ్మాపూర్,సెప్టెంబరు16: తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి మోయతుమ్మెద వాగులో ఓ మత్స్యకారుడి వలకు 28కిలోల చేప చిక్కింది. తిమ్మాపూర్ మండలం సంగంపల్లికి చెందిన తిరుపతి అనే మత్స్యకారుడు సోమవారం కొత్తపల్లి గ్రామం వద్ద లోయర్ మానేరు డ్యాం బ్యాక్ వాటర్ విస్తరించి ఉన్న మోయతుమ్మెద వాగులో వలతో చేపలు పడుతుండగా 28కిలోల బొచ్చె వలకు చిక్కింది. భారీ చేప వలకు చిక్కడంతో తిరుపతి సంతోషం వ్యక్తం చేశాడు. ఈ చేప ధర సుమారు 5వేల రూపాయల వరకు ఉంటుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ఇటీవల పుష్కలంగా వర్షాలు పడటంతో జలాశయాలలో మత్సకారులకు భారీ చేపలు దొరుకుతున్నాయి. ఇంత పెద్ద చేప ఈ ప్రాంతంలో దొరకడం అరుదైనదిగా వారు పేర్కొంటున్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న బియ్యం ట్రక్కు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16: గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు 10టన్నుల బియ్యాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. రామగిరి మండలం బేగంపేట కేంద్రంగా రేషన్ బియ్యంను మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు. రేషన్‌షాపులు, గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని దర్జాగా తరలిస్తున్నారు. ఈ తరలింపునకు ట్రక్కులే కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి బేగంపేట నుంచి మహారాష్ట్రకు ట్రక్కులో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు అడ్డుకున్నారు. టీఎస్22 టీఏ1431 ట్రక్కులో 10టన్నుల రేషన్ బియ్యం, రేషన్ బియ్యం సరఫరాకు సివిల్ సప్లై వాడే గోనె సంచులు కూడా దొరికినట్టు తెలుస్తోంది. ట్రక్కును వన్‌టౌన్‌కు తరలించి ట్రక్కులో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు నెలల క్రితం కూడా బేగంపేటకు చెందిన రేషన్ బియ్యం మాఫియా మహారాష్ట్రకు తరలిస్తుండగా ట్రాలీలను పోలీసులు పట్టుకున్నారు.

ఇంజనీర్స్ డే వేడుకలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 16: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని కాశేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్లను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కంది జ్యోతి, కస్తూరి భారతి, సిద్ది సరిత, కొండ రాధిక, రాగి వందన, కొండూరి రాధిక, చింతల లావణ్య పాల్గొన్నారు.

● బొమ్మకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలవురు ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బట్టు రాజేందర్, జోన్ చైర్‌పర్సన్ చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఎస్జీటీ యూనియన్ వినతి

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, సెప్టెంబరు 16: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర శాఖ బాధ్యులు సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్జీటీ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, మదుసూదనరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, శాంతికిరణ్, శశిధర్, విజేందర్‌రెడ్డి, శేఖర్, మండల బాధ్యులు తదతరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం తగ్గింది. ఎస్సారెస్పీలోకి 10,465 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 10,465 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అటవీ శాఖ అధికారులకు నెమలి అప్పగింత



అధికారులకు నెమలిని అప్పగిస్తున్న యువకుడు

చందుర్తి, సెప్టెంబరు 16 : చందుర్తి మండలం బండపల్లిలో చెరువు ప్రాంతంలో కాలుకు గాయమైన జాతీయపక్షిని గ్రామానికి చెందిన యువకులు రక్షించారు. కాలుకు గాయమై ఇబ్బంది పడుతున్న నెమలిని గమనించిన నాగరాజు, వేణు, మణిసాగర్ అటవీశాఖ సెక్షన్ అధికారి అన్వర్ హుస్సేన్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం దానికి వైద్యం చేసి అటవీశాఖ అధికారులకు అప్పగించగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

భూ వివాదం పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి



సెల్ టవర్ ఎక్కిన పొన్నాలు

చందుర్తి సెప్టెంబరు 16: తన సోదరుడితో కొన్ని సంవత్సరాలుగా భూ వివాదం నడుస్తోందని, సమస్య పరిష్కరించే న్యాయం చేయాలని ఓ వ్యక్తి పురుగుల మందు డబ్బాతో చందుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట సెల్ టవర్ ఎక్కాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జ గట్టు పొన్నాలుకు అతడి తమ్ముడు మోహన్‌తో భూ వివాదం కోర్టులో ఉంది. సమస్య పరిష్కారం కావడం లేదని, తనకు న్యాయం చేయాలని పురుగుల మందు డబ్బాతో చందుర్తి చేరుకొని సెల్ ఎక్కాడు. ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొనడంతో సీఐ వెంకటేశ్వర్లు న్యాయం చేస్తామని, సెల్‌టవర్ దిగి రావాలని సూచించారు. దీంతో టవర్ దిగి వచ్చాడు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

చొప్పదండి, సెప్టెంబర్ 16 : జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 16నుంచి 23 వరకు విద్యాలయ సమితి పెంచినట్లు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



చింతల గుట్ట నుంచి తవ్విన మట్టి



మట్టిని టిప్పర్లలో నింపుతున్న ఎక్స్‌కవేటర్

తోడేస్తున్నారు..



తవ్వి తొలగించిన బండరాళ్లు

• అనుమతులు లేకుండా మట్టి తరలింపు • కరుగుతున్న గుట్టలు • పట్టించుకోని అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 : తిమ్మాపూర్ మండలంలోని గుట్టలను ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వి కొందరు యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కొద్ది రోజులుగా ఈ దందా బహిరంగంగానే కొనసాగుతోంది. తిమ్మాపూర్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూమి, గుట్టలు అంటూ చూడకుండా కొందరు ఇష్టారీతిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రామకృష్ణ కాలనీ గ్రామ శివారు చెర్లపల్లిలో చింతలగుట్టను ధ్వంసం చేస్తూ కొన్ని రోజులుగా జేసీబీలతో మట్టి తీసి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఒక టిప్పర్‌కు 2,800 నుంచి 3వేల రూపాయల చొప్పున మట్టి విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండిపెడుతున్నారు. చింతలగుట్ట పట్టా భూమి అని అది ఉల్లెంగుల ఏకానందం అనే వ్యక్తికి సంబంధించిన భూమి అని అతని అనుమతితోనే మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు అక్కడ ఉన్న వ్యక్తులు తెలిపారు. పట్టా భూమి అయినా మట్టి తవ్వకాల కోసం ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా ఇవేవీ వీరు పట్టించుకోక పోవడంతో పాటు ఇష్టారీతిలో తవ్వకాలు చేపడుతున్నారు. పట్టా భూమిలోని మట్టిని పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు తరలించాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. తవ్వకాలకు సంబంధించిన వ్యక్తి ఏకానందం తన భూమి తన ఇష్టం అని అధికారులను తాను చూసుకుంటు న్నానని చెప్పడం గమనార్హం. మట్టి తవ్వకాలకు, మట్టి విక్రయాలకు ఎవరి అనుమతి అవసరం లేదని తన భూమి తనఇష్టం అని ఆయన పేర్కొన్నాడు. అధికారులకు సమాచారం అందడంతో మట్టి తవ్వకాలు నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చరిత్రను కనుమరుగు చేస్తున్నారు

• కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 16 : ప్రజా పాలన పేరుతో తెలంగాణ చరిత్రను కనుమరుగు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నారన్నారు. అందుకే తెలంగాణ ప్రజా పాలన కార్యక్రమాలకు హాజరు కావడం లేదన్నారు. కాంగ్రెస్‌కు చేతనైతే తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా హాజరవుతామన్నారు. కేంద్రం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరు తన్నామన్నారు. సర్దార్‌పటేల్ పోలో ఆపరేషన్‌తోనే నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ఎంఐఎం పార్టీకి బయపడి ఒక వర్గం ఓట్లకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకుండా ప్రజలను వంచిస్తున్నాయన్నారు. రజాకార్ పార్టీ వారసుడు ఓవైసీ ప్రభుత్వ భూములను కబ్జాచేసి పేదలను దోచుకుంటున్నాడని బండి సంజయ్ ఆరోపించారు. అలాంటి ఓవైసీ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కూల్చ కుండా ఓవైసీకి వంతపాడుతున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సర్ధార్ పటేల్ మాకు వీరుడే అని, పటేల్ వారసులం మేమే అని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి మరల్చేందుకే రాజీవ్ విగ్రహం తెరపైకి తెచ్చారన్నారు. ఖాళీగా ఉన్న కేసీఆర్ కుటుంబానికి ఢిల్లీ సీఎం పదవి ఇచ్చేందుకే కేజ్రీవాల్ రాజీనామా చేశారేమోనని ఎద్దేవా చేశారు. వారిద్ద రిది లిక్కర్ బంధమన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనంపై రాష్ట్ర ప్రభుత్వం గణేష్ ఉత్సవ కమిటీతో చర్చించి అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. హిందు పండుగలపై వివక్ష చూపుతున్నారనే భావన ఉందన్నారు. నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించు కుని పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బండి సంజయ్ అన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

కొడిమ్యాల, సెప్టెంబరు 16 : మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన మామిడి చంద్రయ్య (52)అనే వ్యక్తి మతి స్థిమితం సరిగా లేక ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చంద్ర య్య ఆర్థికంగా ఇబ్బందులపాలై, మద్యానికి బాని సయ్యాడు. దీంతో మతిస్థిమితం సరిగా లేక ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. చంద్రయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర యోగా ఛాంపియన్‌గా ఉమ్మడి జిల్లా జట్టు



ఛాంపియన్ షిప్‌ను అందుకుంటున్న ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16: తెలంగాణ రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్ షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. ఈనెల 14, 15 తేదీల్లో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ఉమ్మడి జిల్లాజట్టు 116 పాయింట్లు సాధించి మొదటి స్థానంతో పాటు ఓవర్‌ఆల్ ఛాంపి యన్ షిప్‌ను అందుకుంది. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకా రులు 7బంగారు, 4 రజత, 4 కాంస్య పతకాలతో పాటు 5వ స్థానంలో నలుగురు, 6వ స్థానంలో ఆర్గురు క్రీడాకా రులు నిలిచి కప్పును కైవసం చేసుకున్నారు. అలాగే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్రంలోనే అత్యధికంగా 16 మంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఛాంపియన్స్‌గా నిలిచిన జిల్లా జట్టును జిల్లా యోగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు సర్ధార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, డివైఎస్‌ఓ శ్రీనివాస్‌గౌడ్, యోగా సంఘం ఉపాధ్య క్షుడు కన్న కృష్ణ, కోచ్‌లు రామకృష్ణ, వి కిష్టయ్య, మల్లేశ్వరి, స్వరూపాచారి, మనోజ్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

జిల్లా జైలులో గాంధీ విగ్రహం ఆవిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ సంపత్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 : కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సోమవారం జైళ్లశాఖ డీఐజీ ఎం.సంపత్ ఆవిష్కరిచారు. జిల్లా జైలును వరంగల్ రేంజ్ డీఐజీ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌ప్రిజన్స్) ఎం.సంపత్ సంవత్సర తనిఖీలో భాగంగా సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలను, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్యసమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత జైలులో కాంటీన్, జైలు ఆసుపత్రి ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, ఖైదీల టాయిలెట్లు, శుభ్రత, వంటశాల, జైలు ఇండస్ట్రీ, పెట్రోల్ బంకులలో పని తీరును తెలుసుకుని అధికారులను అభినందించారు. జైలులోని గార్డెనింగ్ నిర్వహణ, పరిశుభ్రత బాగుందని అధికారులను అభినందించారు. మహిళా జైలును కూడా డీఐజీ సందర్శించారు. అనంతరం జైలు క్వార్టర్‌లో శ్రీ విఘ్నేశ్వర స్వామి పూజలో డీఐజీ పాల్గొన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యాధికారి వేణు గోపాల్, జైలర్స్ శ్రీనివాస్, రమేష్, పర్శ రామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్ సుధాకర్ రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి

బీర్‌పూర్,సెప్టెంబరు 16 : బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు సోమవారం దాడి చేశాయి. గ్రామంలోని చెందిన పోతు రమేష్ కుమారుడు రాణా(9), బొమ్మి డి శశిధర్ కూతురు అధ్యశ్రీ(4) అనే చిన్నారులు వారి ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా వీధికుక్కలు ఇద్దరు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాయి. పిల్లల అరుపులు విన్న రాణా తల్లి గమనించి కుక్కల దాడి నుంచి పిల్లలను రక్షించారు. వెంటనే చిన్నారులను ఆసుపత్రికి తరలించారు.



గేట్లు ఎత్తడంతో కిందకు వస్తున్న నీరు

ఎల్‌ఎండీ గేట్లు ఎత్తిన అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 16 : ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో పాటు మధ్యమానేరు నుంచి సుమారు 3వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఎల్‌ఎండీ జలాశయం ప్రధానగేట్లు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఇరిగేషన్ ఎస్‌ఈ పెద్ది రమేష్ ఆధ్వర్యంలో అధికారులు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. అనంతరం నీటిలో ఇరిగేషన్ అధికారులు పూలుజల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ పెద్ది రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం లోయర్ మానేర్ డ్యాంలో 23.90 టీఎంసీల నీరు ఉందని ఎగువ ఎంఎం ఆర్ నుంచి 3వేల క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండటంతో రెండు గేట్లు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ పెద్ది రమేష్, ఈఈ నాగభూషణం, డీఈ శ్రీనివాస్, ఏఈఈలు కాళిదాస్, వంశీధర్, అంజుమునీసా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు గంటల తర్వాత తిరిగి మూసివేత

ఎస్సారెస్పీ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎంఎంఆర్ నుంచి మూడు వేల క్యూ సెక్కు లు ఎల్‌ఎండిలోకి విడుదల చేశారు. దీంతో అధికారులు 11.30 గంటల సమయంలో గేట్లు మూసివేశారు. అనంతరం కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను మూడువేల క్యూసెక్కులకు పెంచారు. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 4,732, ఔట్‌ఫ్లో 3,309 క్యూసెక్కులు ఉంది.

'నవోదయ'లో ముగిసిన కళోత్సవాలు



విద్యార్థుల ప్రదర్శనలు

చొప్పదండి, సెప్టెంబర్ 16 : చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం ఉత్సవాలు ప్రారంభం కాగా రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. తెలంగాణ క్లస్టర్ స్థాయిలోని తొమ్మిది జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరై వివిధ పోటీలలో పాల్గొన్నారు. నల్లగొండ విద్యాలయం వోకల్ మ్యూజిక్, నృత్యంలో నాగర్‌కర్నూల్, కరీంనగర్ ఇన్‌స్ట్రు మెంటల్, నిజామాబాద్ స్టోరీ టెల్లింగ్, మెదక్ విద్యాలయం విజువల్‌ఆర్ట్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

సింగరేణి కార్మికుడి అనుమానాస్పద మృతి

- ఒంటిపై తీవ్రగాయాలు
- నెల రోజుల్లో పదవీవిరమణ
- మృతిపై అనేక సందేహాలు
- మార్చురీకి తరలించిన పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16 : గోదావరిఖని ఐబీ కాలనీలో నివాసముండే సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్(60) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని గొంతు, చాతి, కాళ్లపై గాయాలున్నాయి. హరిసింగ్ కుటుంబం ఐబీ కాలనీలోని క్వార్టర్ నంబర్ 612లో నివాసముంటున్నది. అతనికి భార్య దస్లి, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురుకు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. హరిసింగ్ మెడికల్ అన్‌ఫిట్‌కు ప్రయత్నించగా అన్‌ఫిట్ కానట్టు తెలుస్తోంది. నెలరోజుల్లో పదవీ విరమణ ఉన్నట్టు సమాచారం. సోమవారం సాయంత్రం హరిసింగ్ భార్య దస్లి బయటకు వచ్చి తన భర్త పరిస్థితి విషమంగా ఉందని స్థానికులకు చెప్పడంతో వారు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అతడు మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. మృత దేహంపై గాయాలు ఉండటంతో వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హరిసింగ్ మృతిపై అనుమానాలు ఉండడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

• గుర్తు తెలియని వ్యక్తుల సంచారం..

సోమవారం మధ్యాహ్నం నుంచి హరిసింగ్ ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సంచారంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గణపతులు వచ్చిన సమయంలో ఇద్దరు వ్యక్తులువచ్చి వెళ్లారని, కొద్దిసేపటికే హరిసింగ్ మృతి చెందారనే చర్చ జరుగుతోంది.

• మృతిపై అనుమానాలున్నాయి...

- వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని ఐబీకాలనీలో హరిసింగ్ మృతిపై అనుమానాలున్నాయి. మృతదేహాన్ని మార్చురీకి తరలించాం. దీనిపై దర్యాప్తు చేస్తున్నాం. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తాం.

పోలీస్ సైరన్‌తో తిరుగుతున్న వాహనం సీజ్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : పోలీస్ సైరన్ వాహనానికి అమర్చుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. సోమారంపేట గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్ తన డ్రైవర్ పల్మారి శ్రీనివాస్‌తో కలిసి నిబంధనలకు విరుద్ధంగా కారుకు పోలీస్ సైరన్ అమర్చుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామానికి హైడ్‌కానిస్టేబుల్ దేవేందర్ వెళ్లగా సైరన్ బిగించిన వాహనాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసున మోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 : ప్రమాదవాశాత్తు గ్యాస్ సిలిండర్ మంటలు అంటుకుని తీవ్ర గాయాలై చికిత్స పొంతుతున్న వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. పట్టణంలోని పద్మనగర్ ప్రాంతానికి చెందిన సింగం సుగుణ(80) అనే వృద్ధురాలు ఆదివారం తన ఇంటలో వంట చేస్తున్న సమయంలో ప్రమాదావశాత్తు గ్యాస్ సిలిండర్ మంటలు అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అదే రోజు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుగుణ సోమవారం మృతి చెందింది. మృతుడి కుమారుడు గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసునమోదు చేసినట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఏనుగుల ముత్తయ్య(33) అనే వ్యవసాయ కూలీ ఆర్థిక ఇబ్బందులతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం .. ముత్తయ్య గ్రామంలో ఉపాధిలేక పోవడంతో రెండుసార్లు విదేశాలకు వెళ్లాడు. అక్కడా సరైన పని దొరకక ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ముత్తయ్యకు రూ.3 లక్షల అప్పులు అయ్యాయి. అనంతరం ఇంటికి వచ్చి వ్యవసాయం చేసినా అప్పులు తీరలేదు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామసమీపంలో సోమవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

తెలంగాణ విముక్తి పోరులో మంథని వీరులు



రఘునాథ్‌కాచే

గులుకోట శ్రీరాములు

సెప్టెంబరు 17 సందర్భంగా మంథని, మహదేవపూర్ ప్రాంత పోరాట యోధులను ఒక్కసారి స్మరించుకుందాం. ఎందరో మహానుబావుల పోరాట ఫలితంగా సుదీర్ఘ బ్రిటీష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన భారత ప్రభుత్వంలో విలీనం కాని హైదరాబాద్ సంస్థాన నిజాం నిరంకుశ పాలనకు చరమ గీతం పాడేందుకు ముందుకు సాగారు.

మంథని, సెప్టెంబరు 16: తెలంగాణ పల్లెల్లో స్వాతంత్ర్యాన్ని తేవడానికి మంథని ప్రాంత పోరాట వీరులు సాయుధ, సత్యాగ్రహ సంగ్రామాలకు శ్రీకారం చుట్టారు. నిజాం నవాబు పాలనను అంతం చేసేందుకు మంథని, మహదేవపూర్ ప్రాంతానికి చెందిన ఎందరో పోరాట యోధులు ఉన్న ఊరుని, కన్న తల్లిని, భార్యాబిడ్డలను వీడి అజ్ఞాత బాట పట్టి సాయుధంగా నిజాం పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. జిల్లాలో సత్యాగ్రహ ఉద్యమానికి సైతం బీజాలు వేశారు. ఒక వైపు సాయుధంగా, మరో వైపు సత్యగ్రహ ఉద్యమాల్లో ప్రజలను చైతన్య వంతులను చేసి నిజాం నవాబ్ మెడలు వంచడానికి అలుపెరుగని పోరాటం చేసిన మంథని పోరు బిడ్డలను ఒక్కసారి స్మరించుకుందాం.. మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి, రఘునాథ్‌కాచే జిల్లాలో తొలి సత్యాగ్రహ వాదిగా నిజాంకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య వంతులు చేస్తూ కార్యకలాపాలను విస్తరించడంతో కీలక భూమిక పోషిం చారు. వీరిద్దరి నాయ కత్వంలో ఎందరో యోధులు సాయుధ, సత్యాగ్రహ పోరాటం చేశారు. తెలంగాణ విమోచనం జరిగి

● సాయుధ పోరు వీరులు

రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో మంథనికి చెందిన స్వర్గీయ గులుకోట శ్రీరాములు నేతృత్వంలో పనకంటి కిషన్ రావు, సువర్ణ ప్రభాకర్, చొప్పకట్ల చంటయ్య, డీ. రాజన్న, రాంపెల్లి కిష్టయ్య, దామోదర్‌ధామస్, శివనాద్రి శంకరయ్య గుప్తా, నరహరి, ఎలిశెట్టి సీతారాంలతో పాటు చాలా మంది సాయుధ పోరాటంలో పాల్గొన్నారు.

● సత్యాగ్రహ వాదులు

స్వామి రామనందతీర్థ సరస్వతీ పిలుపు మేరకు సత్యాగ్రహ ఉద్యమంలో మంథనికి చెందిన రఘునాథ్‌కాచే ఆధ్వర్యంలో పి గణపతిరావు, అవధానుల కిష్టయ్య, ఎం గణపతి, మురళీధర్‌కాచే, దేవళ్ల రాజేశ్వర్‌రావు, గట్టు రామన్న, వెంకటరాజన్న, ఎస్ నర్సింహులుతోపాటు చాలా మంది వీరులు మంథని ప్రాంతంలో నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పనిచేశారు. నిజాంను వ్యతిరేకించినందుకు వీరంతా కరీంనగర్, నిజామాబాద్ జైళ్లలో శిక్షను అనుభవించారు.

● నిజాం పోలీస్‌స్టేషన్లపై దాడులు

మహారాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆయుధ సంపత్తిని సమకూర్చుకున్న శ్రీరాములు బృందం 1948లో గోదావరినది దాటి నిజాం సంస్థాన గ్రామాలైన కాళేశ్వరం, మహదేవపూర్, దామెరకుంట పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి నిజాం ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దామెరకుంటలో కలెక్టర్ పర్యటనకు వెళ్లిన తహశీలు అమ్లాలోని అధికారులపై దాడి చేసి చంపిన సంఘటనతో నిజాం సర్కార్ గడగడలాడింది.



భారత సైన్యం ఆధ్వర్యంలో శిక్షణ

శ్రీరాములు బృందం మహారాష్ట్రలోని చంద్రాపూర్ (చాందా)లో భారత సైన్యం ఆధ్వర్యంలో సాయుధ శిక్షణ పొందారు. గడ్చిరోలి జిల్లా సిరివంచలో క్యాంపు ను ఏర్పాటు చేసుకొని ఆయుధాలతో అజ్ఞాతంలో ఉంటూ నిజాం పోలీస్, అధికారులపై గెరిల్లా దాడులు చేసి సంచలనం సృష్టించారు. మంథని, మహదేవపూర్ తాలూ కాల్లో సాయుధ కార్యకలాపాలు నిర్వహించారు.

కాళేశ్వరం నిజాం రాణాపై జరిపిన దాడిలో శ్రీరాములు కుడి కాలుకు తుపాకి తూటాలు తగిలి గాయపడ్డ కూడా మొక్కవోని ధైర్యంతో సహచరులతో కలిసి దాడిని విజయవంతం చేశారు. ఈ దాడుల స్ఫూర్తితో మంథని, మహదేవపూర్ తాలూకాల్లో నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు. 1948 సెప్టెంబరు 17న భారత సైనిక చర్యతో దిగి వచ్చి భారత సర్కార్ ముందు నిజాం నవాబ్ తలవంచడంతో హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వం విలీనమైంది.

● మంథని తొలి ఎమ్మెల్యేగా శ్రీరాములు..

తెలంగాణ విమోచనం అనంతరం అజ్ఞాతంలో ఉన్న శ్రీరాములు బృందం బయటకు రాగా కాళేశ్వరం

● నిజాం సర్కార్‌పై సాయుధ, సత్యాగ్రహ తిరుగుబాటు

● రాణాలపై దాడులు-అధికారుల హత్యలు

● చాందా క్యాంపులో సాయుధ శిక్షణ

నుంచి మంథని వరకు దారి పొడువున గ్రామగ్రామాన ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రఘునాథ్ కాచే ఆధ్వర్యంలో మంథనిలో జరిగిన బహిరంగ సభలో స్వామిజీ తొలిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. 1952లో జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లో శ్రీరాములు కాంగ్రెస్ పార్టీని విభేదించి సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మంథని మొట్టమొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. శ్రీరాములు బృందంలో సాయుధ పోరాటం చేసిన వారిలో సువర్ణ ప్రభాకర్ ఆంధ్ర ప్రదేశ్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌గా పని చేసి పదవీ విరమణ పొందారు. పనకంటి కిషన్‌రావు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసి స్వర్గస్తులైనారు.

● పోరాట యోధులకు గుర్తింపు..

నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటానికి చిహ్నంగా గుంజపడుగు, దామెరకుంట, ఒడిపిలవంచ గ్రామాల్లో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం స్తూపాలను ఏర్పాటు చేసింది. అలాగే అప్పటి ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ మంథని స్వాతంత్ర్య సమరయోధులను ఢిల్లీకి పిలిపించుకొని వారిని ఘనంగా సన్మానించడంతో పాటు పెన్షన్లు, వ్యవసాయ భూములు, స్వాతంత్ర్య సమరయోధుల ధ్రువీకరణ ప్రతాలను ప్రదానం చేశారు.

● స్మృతి చిహ్నాం ఏర్పాటు చేయాలి..

తెలంగాణ విమోచన కోసం సత్యగ్రహ, సాయుధ ఉద్యమంలో పనిచేసిన స్వాతంత్ర సమరయోధుల వివరాలు, వారి పోరాటాలు, త్యాగాలను భావితరాలకు అందించే విధంగా తెలంగాణ ప్రభుత్వం మంథనిలో స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని స్వాతంత్ర్య సమరయోధుల వారసులు గులుకోట శ్రీకాంత్, శశిభూషన్‌కాచే, చొప్పకట్ల రామ్మ,శ్రీకాంత్‌లు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

పెద్దపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయం ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద హాజరై ఉదయం 10గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం 10.08 గంటలకు పోలీసులచే వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి

-అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, సెప్టెంబరు 16: తన మద్దతుదారులు ప్రతీ పట్టభద్రుడి ఎన్‌రోల్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సుల్తానాబాద్ అల్ఫోర్స్ పాఠశాలలో అర్హులైన పట్టభద్రులకు ఎన్‌రోల్‌మెంట్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లే పట్టభద్రులు, యువత విషయంలో అధికప్రాధాన్యం ఇస్తానన్నారు. ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహన లేక గత ఎన్నికల్లో చాలామంది పట్టభద్రులు ఎన్‌రోల్‌మెంట్ చేసుకోలేదన్నారు. అందుకే ప్రతీ ప్రాంతంలో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్‌రోల్‌మెంట్‌లో పాల్గొనాలని కోరారు.

గోదావరి వంతెనపై ఔట్‌పోస్టు ప్రారంభం



ఔట్‌పోస్టును ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

య్లైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 16: గోదావరిఖని గోదావరి వంతెనపై నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్టు కంట్రోల్ రూంను సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ డీసీపీ చేతనతో కలసి ప్రారంభించారు. ఈసందర్భ ంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఔట్‌పోస్టు ద్వారా ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ ఉండేలా సిబ్బందిని ఏర్పాటు చేయనున్నామని, ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. వీటి ద్వారా పోలీస్ కంట్రోలింగ్ సిస్టం కొనసాగించనున్నట్టు తెలిపారు. బ్రిడ్జి మీద ఎక్కడ ఎలాంటి పరిస్థితులు ఉన్నా వాటిని సత్వరమే సరిదిద్దే అవకాశం ఉంటుందని తెలిపారు. నది వద్ద ఎటువంటి ప్రమాదాలు జరిగా సత్వరమే స్పందించేలా రివర్‌గార్డు పోలీసులు ఔట్‌పోస్టులో సిద్ధంగా ఉంటారని సీపీ తెలిపారు. అన్ని రకాల అధునాతన పరికరాలు, సిబ్బంది నిత్యం ఔట్‌పోస్టు నుండి పర్యవేక్షించేలా ఏర్పాటు చేసినట్టు సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేందర్‌రావు, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాదరావులు, ఆర్‌ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్ పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 16: మండలంలోని ఆశన్నపల్లె నుంచి మంగపేటకు వెళ్లేదారిలో ఉన్న కల్వర్టుకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షానికి పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎమ్మెల్యే చింతకుంట విజయరామారావు, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్‌కు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాక్షికంగా కూలిన కల్వర్టుకు సోమవారం జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా మట్టిపోసి మరమ్మతులు చేయించినట్లు రైతులు తెలిపారు. కూలిన కల్వర్టును, దారిని మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

'నేత్రదానంలో ఓదెలను ఆదర్శ గ్రామంగా గుర్తించాలి'

ఓదెల, సెప్టెంబరు 16: అవయవ, శరీర, నేత్రదానాల్లో ఓదెలను ఆదర్శ గ్రామంగా గుర్తించాలని సోమవారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి సదాశియ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భిష్మాచారి వినతిపత్రాన్ని సమర్పించారు. అవయవ, శరీర, నేత్ర దానాల అంశాన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పొందుపరచాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు సేవలందించేందుకు నేత్ర సేకరణ సిబ్బందిని నియమించాలని కోరారు. నేత్రదానాలకు ముందుకు వచ్చినా నేత్ర సేకరణకు సిబ్బంది లేక సేకరించలేకపోతున్నామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటివరకు మరణించిన వ్యక్తుల నుంచి 1190 నేత్రాలు, 90పైగా అవయవాలు, 125 వరకు శరీర దానాలను సేకరించామని తెలిపారు. ఓదెల మండలంలో 180 పైగా నేత్ర అవయ, శారీర, దానాలు చేసేందుకు గ్రామపంచాయతీల తీర్మానం చేసిన ఓదెల, అబ్బిడిపల్లి గ్రామాల ఆదర్శం గురించి మంత్రికి వివరించారు. ఏపీలో అవయవ దాతల అంతిమ సంస్కారం ప్రభుత్వ లాంచనాలతో నిర్వహిస్తున్నట్లు, తెలంగాణలో కూడా నిర్వహించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీంతో మంత్రి సుముఖత వ్యక్తం చేస్తూ, అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సారంగం, క్యాతం సత్యనారాయణ, తుమ్మ మధు, శాతాల్ల కుమార్, రవి, అశోక్ పాల్గొన్నారు.

'కరాటేతో శారీరక దృఢత్వం'

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 16: కరాటేను నేర్చుకోవడం వల్ల మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని, విద్యార్థులు విద్యతో పాటు కరాటే తప్పకుండా నేర్చుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖనిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బెల్టుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యను ఎదుర్కొవడానికి మానసికంగా ధైర్యంగా ఉండేందుకు, అనుకోని ఆపద వస్తే రక్షించుకునేందుకు కరాటే అవసరమని అన్నారు. ఈదిశగా తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రోత్సహించాలన్నారు.

అనంతరం గ్రేడింగ్ టెస్టులో కటాస్, కుమితి, నాంచాక్, స్టిక్, టైల్, పాట్, బ్రేకింగ్‌లతో పాటు హలో విన్యాసాలు విద్యార్థులు చేశారు. సుమారు 60మంది విద్యార్థులకు బెల్ట్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ నగర అధ్యక్షుడు గట్ల రమేష్, మహిరా రియల్ ఎస్టేట్స్ చైర్మన్లు గంగుల సంతోష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, కార్యదర్శి ఎం.రమేష్, చీఫ్ అండ్ బెల్ట్ ఎగ్జామినర్ కరాటే శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్.శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నిదేశ్‌కుమార్, రోహిత్‌కుమార్, సంజన, అభిజ్ఞ, శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పక్షోత్సవాలు ప్రారంభం

జ్యోతినగర్, సెప్టెంబరు 16: రామగుండం ఎన్టీపీసీలో స్వచ్ఛ పక్షోత్సవాలు సోవవారం ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాడు స్వచ్ఛ పక్షోత్సవాలను ప్రారంభించి శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులు ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో శ్రమదానం చేసి రోడ్లను శుభ్రపరిచారు. ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తమ గృహాలనే కాకుడా చుట్టుపక్కల పరిసరాలను సైతం పరిశుభ్రదంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛ పక్షోత్సవాల సందర్భంగా టౌన్‌షిప్‌లో ర్యాలీ నిర్వహించారు. 15 రోజులపాటు జరిగే పక్షోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

హిందీ పక్షోత్సవాలు ప్రారంభం

జ్యోతినగర్, సెప్టెంబరు16: రాజ్‌భాష హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీపీసీలో హిందీ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఢిల్లీలో శనివారం హిందీ పక్వాడాను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రామగుండం ఎన్టీపీసీలో 15 రోజులపాటు ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులు, సీఐఎస్ఎఫ్ జవానులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నారు.

హిందీ పక్షోత్సవాలను పురస్కరించుకొని ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు ఉద్యోగులకు సందేశం విడుదల చేశారు. ప్రతి ఉద్యోగి హిందీ భాషను ఉద్యోగ నిర్వహణలో ఉపయోగించా లన్నారు. రాజ్‌భాషను ఎన్టీపీసీ ప్రాజెక్టులో పరిపాలన వ్యవహారాల్లో విస్తృతంగా వినియోగించేలా అధికారులు కృషి చేయాలన్నారు.

'ఫ్లెక్సీలతో అధికార పార్టీ చిల్లర రాజకీయం'

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 16: హోర్డింగ్, ఫ్లెక్సీలతో అధికార పార్టీ కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు చేస్తోందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గోలివాడ ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా గణనాథులకు స్వాగతం పలికేందుకు ప్రధానచౌరస్తా, పలు చోట్ల ఫ్లెక్సీ, హోర్డింగ్స్‌కు ఎన్‌సీపీ తరుపున ఈనెల 10వ తేది నుంచి 17వ తేదీ వరకు రోజుకు వెయ్యి రూపాయల చొప్పున చెల్లించి ఫ్లెక్సీలను ప్రధానచౌరస్తాలో ఏర్పాటు చేశామని తెలిపారు. గణనాథులకు స్వాగతం పలుకుతూ ఎన్‌సీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సోమవారం 11గంటల వరకు ఉన్న ఫ్లెక్సీని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏజెన్సీని బెదిరింపులకు గురిచేసి తమ పార్టీ ఫ్లెక్సీపై కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. గణనాథులు నిమజ్జనానికి తరలుతున్న సందర్భంగా పోలీసులకు, ప్రజలకు సహకరించాలని ఎలాంటి నిరసన చేయలేదని తెలిపారు.

ఈత వనాలకు గీత కార్మికుల పూజలు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 16: మండలంలోని పెద్దకల్వల గ్రామంలో సోమవారం గీత కార్మికులు ఈతవనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌడకులసంఘం నాయకులు పోచారం గౌడ్, నంబయ్య గౌడ్‌లు మాట్లాడుతూ ఈత కల్లు గీసేముందు తమ కులదైవతలకు మొక్కులు చెల్లించి ప్రతి ఏడా దసరా నెల ముందు ఈతవనాలక ప్రత్యేక పూజలు చేస్తామని పేర్కోన్నారు. తాతల కాలం నుండి ఆనవాయితీ వస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కోట నంబయ్య, నారాయణ గౌడ్, సందీప్ గౌడ్, పోచాలు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ కమిటీ ఆధ్వర్యంలో లక్కీడ్రా

రామగిరి, సెప్టెంబరు 16: మండలంలోని కల్వచర్ల గ్రామం విద్యానగర్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో లక్కీ డ్రాను సోమవారం నిర్వహించారు. గణేష్ మండప కమిటీ ఆధ్వర్యంలో 90 మంది సభ్యులతో గ్రూప్ ఏర్పాటు చేసి డ్రా తీశారు. నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు అందుకున్న వెండి ప్రతిమను డ్రాలో గెలుపొందిన కొంక స్వరాజ్ కుటుంబ సభ్యులకు కమిటీ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట పద్మ, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, లైయన్స్ క్లబ్ డైరెక్టర్ శరణ్యమారుతి యాదవ్, శంకర్, కనకయ్య, తదితరులు పాల్గోన్నారు.

రూ.45,116కు లడ్డూ వేలం

రామగిరి, సెప్టెంబరు 16: మండలంలోని కల్వచర్ల గోకుల్‌నగర్ లడ్డూ అక్షరాల రూ. 45, 116 రూపాయలకు వేలం పాడారు. నవరాత్రుల సందర్భంగా గోకుల్ నగర్‌లోని గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు అందుకున్న లడ్డూను సోమవారం గణేష్ కమిటీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. బనుక అంజయ్య దంపతులు 45,116 రూపాయాలకు లడ్డూను దక్కించుకున్నారు. మండలంలోని అత్యధికంగా రుసుము గల వేలం పాడినట్లు సమాచారం.

ఆర్జీ-3, ఏపీఏల్లో ఇంజనీర్స్ డే

రామగిరి, సెప్టెంబరు 16: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లో ఇంజనీర్స్ డేను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మైనింగ్ అధికారులు రఘుపతి, సివిల్ ఇంజనీర్ రామకృష్ణను జీఎంలు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు యాదయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రాజారెడ్డి, కాశీవిశ్వేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, సుదర్శనం, షబ్బీరుద్దీన్, సత్యనారయణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

● మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆర్జీ-3 డివైస్‌సీపీ రాజేంద్రప్రసాద్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు మోల్మూమూరి శ్రీనివాస్, సివిల్ అధికారులు రామకృష్ణ, బెల్లం శ్రీనివాస్, కాంట్రాక్టర్లు కొమ్ము కుమార్, ఉగ్గే కుమార్, హైదర్, సంపత్, ఆకుల వెంకన్న శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ - వందేభారత్ రైలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

అంతర్గాం, సెప్టెంబరు 16: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాడుపడుతానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. సోమవారం రామగుండం రైల్వేస్టేషన్‌లో నాగపూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించి ఈ మేరకు మాట్లాడారు. రైల్వేశాఖ నూతనంగా వందే భారత్ రైలును ప్రవేశపెట్టగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా ప్రారంభోత్సవం చేశారు. నాగాపూర్‌లో సాయంత్రం ఐదు గంటకు ప్రారంభమైన రైలు రాత్రి 8.30గంటలకు రామగుండానికి చేరుకుంది. వందే భారత్ రైలు మంగళవారం మినహా ప్రతి రోజు నాగపూర్‌లో ఉదయం ఐదు గంటలకు బయలుదేరి రామ గుండానికి 9.10 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 12.15గంటలకు చేరుకుంటుంది.

వందే భారత్ రైలు రామగుండంలో నిలుపుదల చేయడానికి రైల్వే మంత్రిని కలిసి కోరడం జరిగిందని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ ప్రజల దీవెనతో పార్లమెంట్‌లో సమస్యలపై గళమెత్తుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రైల్వే ఉన్నతాధికారులు ఏడీఆర్‌ఎం రాజీవ్ గంగేలి, వామనమూర్తి, రజనేష్ కుమార్, రామగుండం సీపీ శ్రీనివాస్, రవి, రాజమోహన్, ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్, కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 16: మిలాద్ ఉన్ నబి (మహ్మద్ ప్రవక్త జన్మదినం) సందర్భంగా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ముస్లింలు సోమవారం రోగులకు పండ్లు, బ్రేడ్లు, బిస్కెట్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ యువత చెడు మార్గంలో వెళ్లకూడదని శాంతి మార్గంలో నడవాలని సూచించారు.

ఎలిగేడు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రేమ సహనం శాంతి సామరస్యాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, సెప్టెంబరు 16: ఆది దేవుడైన గణేశుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు మండపాల్లో నెలకొన్న గణనాథుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ విఘ్నేశ్వరుడి కృపా కటాక్షములు పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ శివాలయంలో చైర్మన్ అల్లంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య భవన్‌లో అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయరమణారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, నాయకులు మినుపాల ప్రకాష్ రావు, అంతటి అన్నయ్య గౌడ్, శ్రీగిరి శ్రీనివాస్ , పెద్దపల్లి జిల్లా రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నగునూరి అశోక్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కొమురవెల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ

ముత్తారం సెప్టెంబర్ 16: మండల కేంద్రంలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన భగీరథ రాము ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గణనాథుని ఆశీర్వాదాలతో విద్యార్థులు చదువులో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అన్నారు. ఉదయం ముత్తారంలోని గణనాథుడిని ఎస్ఐ దర్శించుకుని, పూజలు చేశారు. కార్యక్రమంలో గట్టయ్య, చేరాలు, రాజేందర్, శంకర్ పాలొన్నారు.

నిబంధనలకు 'నిమజ్జనం'



రమేష్‌నగర్ సెంటర్‌లోని మద్యంషాపును తెరుస్తున్న వ్యక్తులు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 16: గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మద్యం షాపులను మూసివేయాలన్న నిబంధనలకు సోమవారం గోదావరిఖని రమేష్‌నగర్ సెంటర్‌లోని ఓ వైన్‌షాపు నిమజ్జనం చేసింది. గణేష్ నిమజ్జనం సందర్భంగా మూసి ఉన్న షాపును రాత్రి 9.45 నిమిషాలకు దర్జాగా తెరిచి మద్యం తీసుకెళ్లారు.

నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన సీఐ

ముత్తారం సెప్టెంబర్ 16: మండలంలోని అడవి శ్రీరాంపూర్ ఓడేడు మానేరు శివారు ప్రాంతాల్లో వినాయక నిమజ్జన ఏర్పాట్లను మంథని సిఐ రాజు గౌడ్ సోమవారం పరిశీలించారు. గణనాథులను తీసుకువచ్చే వాహనాలు తిరిగి వెళ్లేందుకు సౌకర్యమైన రోడ్డును చేయించాలని స్థానికులకు సూచించారు. అలాగే మానేరులో నీటి ప్రవాహం ఉన్నందున నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలను పోలీస్ పర్యవేక్షణలో తీసుకోవాలని ఆయన సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై నరేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంథనిలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది

భారత మాజీ క్రికెటర్ వెంకటపతిరాజు

మంథని, సెప్టెంబరు 16: మంత్రపురిగా పేరుగాంచిన మంథనిలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందని భారత జట్టు మాజీ క్రికెటర్ వెంకటపతిరాజు అన్నారు. సోమవారం మంథనిలోని గౌతమేశ్వర, రామాలయం, బాలసరస్వతీమాత, మహాలక్ష్మి, భిక్షేశ్వరాలయం, ఓంకారేశ్వరాలయం, హనుమాన్ ఆలయాల్లో సోమవారం తన సతీమణి ఉమామహేశ్వరీతో కలిసి వెంకటపతిరాజు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఇటీవల ప్రముఖ స్పోర్ట్స్ జర్నలిస్టులు, క్రికెట్ కామెంటేటర్లు మహావాది సుధీర్, విజయ్‌కుమార్‌ల మాతృమూర్తి సరోజనీదేవీ స్వర్గస్థులైన సందర్భంగా వెంకటపతిరాజు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథనిలో పురాతన ఆలయాలను సందరిస్తే ఎంతో తృప్తి కలిగిందన్నారు. తెలంగాణలో మంథని ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకుందన్నారు. మేధావుల గడ్డగా పేరుగాంచిన, సనాతన సంప్రదాయాలను పాటిస్తున్న మంథ నికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వెంకటపతిరాజు దంపతులను పెంజేరుకట్ట హనుమాన్, సీలేశ్వర-సిద్ధశ్వరాల యం తరుపున లోకే మనోహర్ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. మంథనికి వచ్చిన క్రికెటర్ వెంకటపతిరాజు చూడటానికి, ఫొటోలు దిగడానికి యువకులు ఉత్సాహాన్ని చూపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డి, కౌన్సిలర్ చొప్పకట్ల హన్మంతు, కాంగ్రెస్ నేతలు ఉప్పట్ల శ్రీనివాస్, పెంటరి రాజు పాల్గన్నారు.



భిక్షేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న వెంకటపతిరాజు దంపతులు